క్లుప్తంగా

ఎస్ఎన్‌పురం సీఐకి సత్కారం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్‌పురం పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చిన వై. బాల రాజాజీని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణపురంలోని లా అండ్ ఆర్డర్ విషయాలపై ఇన్‌స్పెక్టర్‌తో చర్చించారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల నిఘా ఏర్పాటు చేసి, అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సీఐని కలిసిన వారిలో కె.ఫణి, కొలవెన్ను కొండ, చాంద్ శర్మ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు సోమవారం సికింద్రాబాద్‌కు చెందిన భక్తులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. సికింద్రాబాద్ మల్కాజిగిరికి చెందిన బలభద్రపాత్రుని సత్యవతీదేవి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ. 1,11,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.

మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఓ అపార్టుమెంటుపై నుంచి దూకి మహిళ చనిపోయిన ఘటనపై నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ముదరబోయిన హైమావతి భర్తతో విడిపోయి మహేష్ అనే వ్యక్తితో కలిసి ఉంటుంది. కాగా హైమావతికి, మహేష్‌కు మధ్య విబేధాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో మహేష్ ఆమెను తరచు కొట్టడంతో శ్రీనగర్ కాలనీలో తన స్నేహితురాలి ఇంటి వద్ద ఉంటోంది. ఈనెల 11వ తేదీన రాత్రి మహేష్ శ్రీనగర్ కాలనీ వెళ్లి ఆమెను కొట్టాడు. ఈ విషయం నున్న గ్రామంలో ఉన్న మహేష్ తల్లితో చెప్పి అపార్టుమెంటుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకొంది. మృతురాలి తల్లి సీతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థిని రచనకు అభినందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డ్రాయింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థిని పి. రచనను శారదా కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈనెల 9న మేరీ స్టెల్లా కళాశాలలో ఇంటర్ కాలేజియేట్ ఫిజిక్స్ ఇన్‌స్పైర్ క్లబ్ మీట్–2024 ఆధ్వర్యంలో హిరోషిమా, నాగసాకిపై అణుబాంబు దాడిపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శారదా డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ సెకండ్ ఇయర్ విద్యార్థిని రచన ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆమెను సోమవారం శారదా కళాశాలలో యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరశర్మ, కరస్పాండెంట్ కుందా రామనారాయణ, వరప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవస్థలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రంలో ప్రింటర్ పనిచేయడం లేదు. దీంతో ఇక్కడ విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వచ్చిన వారిని శ్రీనగర్ కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు పంపిస్తున్నారు. శ్రీనగర్ కాలనీలో తమ ప్రాంతంలోని వినియోగదారులకు బిల్లులు కట్టించుకోవడమే ఇబ్బందిగా ఉందని ఇతర ప్రాంతాల బిల్లులు ఎలా తీసుకుంటామని చెబుతుండటంతో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వచ్చిన సీనియర్ సిటిజన్‌లు క్యూలైన్‌లో నిలవలేక నానాయాతన పడుతున్నారు. ప్రింటర్ ఎప్పుడు బాగు చేస్తారో బిల్లులు ఎప్పుడు తీసుకుంటారో తెలియక వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు.

దొంగలు బాబోయ్.. దొంగలు

- జోరుగా దొంగతనాలు
- కానరాని పోలీస్ బీట్
- పనిచేయని నిఘా నేత్రాలు
- బెంబేలెత్తిపోతున్న స్థానికులు



దేవీనగర్‌లో ఆరుసార్లు చోరీకి గురైన బడ్డీకొట్టు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒకప్పుడు వేసవి కాలంలోనే చోరీలు అధికంగా జరిగేవి. కానీ నేడు కాలంతో సంబంధం లేకుండా దొంగలు పేట్రేగిపోతున్నారు. చేసిన చోటే దొంగతనాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ముఖ్యంగా 30వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుడమేరు మధ్యకట్ట, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, గద్దె వెంకట్రామయ్యనగర్ ప్రాంతాల్లో చోరీలు అధికంగా జరుగుతున్నాయి.

తాళాలు వేసిన ఇళ్లు, బడ్డీకొట్లే లక్ష్యం..

తాళాలు వేసిన ఇళ్లు, బడ్డీకొట్లే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో బుడమేరు మధ్యకట్టలో పదుల సంఖ్యలో చోరీలు జరిగాయి. అయితే తక్కువ మొత్తంలో చోరీలు జరిగిన వారు మాత్రం పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయలేదు. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుడమేరు మధ్యకట్టలో ఇంటికి తాళం వేసి వెళ్లిన మాచర్ల పద్మ నివాసంలో 21 గ్రాముల బంగారం, రూ. 20వేలు నగదు, వెండి పట్టీలు చోరీకి గురయ్యాయి. అలాగే గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుడమేరు మధ్యకట్ట లెనిన్‌నగర్‌కు చెందిన ఎస్ దుర్గాప్రసాద్ నివాసంలో తాళాలు పగుల కొట్టి ఇంట్లోని 10 కాసుల బంగారం, రూ. లక్ష నగదు చోరీ చేశారు. అలాగే నిత్యం రద్దీగా ఉండే దేవీనగర్ 8వ రోడ్డు ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లోని నాగమణి బడ్డీకొట్టులో ఇప్పటి వరకు నాలుగు ధపాలుగా చోరీలు జరిగాయి. ఇందులో సుమారు రూ. 10వేలు చోరీ జరిగాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బడ్డీకొట్టులో గల్లాపెట్టె తాళం విరగ్గొట్టిన దృశ్యం

పోలీసులు దృష్టి సారించాలి..



దేవీనగర్ 8వ రోడ్డులో పని చేయని సీసీ కెమెరా

అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అప్పటి సీఐ ఎస్‌వీవీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దేవీనగర్ 8వ రోడ్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే సదరు సీసీ కెమెరాలు గత కొంతకాలంగా పనిచేయడం లేదు. దీంతో నేరాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. నేరాల నియంత్రణపై ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, గస్తీని పెంచాలని స్థానికులు కోరుతున్నారు. గస్తీని మెయిన్ రోడ్డులకే పరిమితం కాకుండా శివారు ప్రాంతాలకు పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

అదే ప్రాంతానికి చెందిన నరసింహారావు బడ్డీకొట్టులో ఇప్పటివరకు ఆరు సార్లు తాళాలు, తలుపులు పగుల కొట్టి సుమారు రూ. 25 వేలు విలువైన నగదు, సరుకు చోరీ చేశారు.

ఫిర్యాదులకు సంతృప్తికర పరిష్కారం

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిచాలని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. మొత్తం 16 ఫిర్యాదులు రాగా వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తికరమైన పరిష్కారాన్ని అందించాలని సూచించారు. ఒకే సమస్య వివిధ విభాగాల మధ్య ఉంటే ఆయా శాఖాధికారులు సమన్వయంతో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పట్టణ ప్రణాళిక విభాగంపై–9, ఇంజినీరింగ్‌పై –4, ప్రజారోగ్యం, ఎస్టేట్స్ విభాగం, రెవెన్యూపై ఒక్కో ఫిర్యాదు వచ్చింది. అడిషనల్ కమిషనర్ (జనరల్) డాక్టర్ ఎ.మహేష్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్‌రావు, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సజన, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, బయాలజిస్టు సూర్యకుమార్, డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ మాల్యాద్రి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు సహకరించాలి



మురుగునీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, దోమలకు ఆవాస కేంద్రాలుగా మారిన ఖాళీ స్థలాలు మెరక చేయించుకోవాలని నగరపాలకసంస్థ బయాలజిస్టు సూర్యనాయక్ సూచించారు. స్థానిక 30వ డివిజన్ వినాయకనగర్‌లో సోమవారం నగరపాలకసంస్థ మలేరియా విభాగం సిబ్బంది యాంటీ మలేరియా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకనగర్, దావు బుచ్చయ్యకాలనీ, గద్దె వెంకట్రామయ్యనగర్ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాల్లో మురుగు, వర్షపునీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో ఖాళీస్థలాల్లో నీరు నిలచిపోతుందన్నారు. కావున ఖాళీ స్థలాల యజమానులు మెరక చేయించుకునేలా రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సహకరించాలని కోరారు. లేనిపక్షంలో తాము వాటి యజమానులకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. వినాయకనగర్‌లోని ఖాళీస్థలాల యజమానులతో మాట్లాడి మెరక చేయించాలని అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రవికి సూచించారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ బెనర్జీ, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొని మురుగునీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్, గంబూసియా చేపలు వేశారు.

ఖాళీ స్థలాలు పరిశీలించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్

సాక్షి ఎఫెక్ట్



ఖాళీస్థలాలల్లో పెరిగిన జమ్మును పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. 30వ డివిజన్‌లోని గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌లోని ఖాళీ ప్రదేశాలు, చెత్తచెదారం పేరుకుపోయిన ప్రాంతాలను సోమవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. డివిజన్‌లో ఖాళీస్థలాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో పిచ్చి మొక్కలు, జమ్ము పెరిగిపోవడంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి ఆదివారం 'ప్రజారోగ్యం ఖాళీ' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఆయన ఖాళీ ప్రదేశాలను పరిశీలించి వాటి యజమానులతో మాట్లాడారు. స్వచ్ఛందంగా పిచ్చిమొక్కలు తొలగించుకోవడంతో పాటు మెరక చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేస్త్రి శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రామలక్ష్మణ నాణెం అంటూ వ్యాపారికి బురిడీ

- ముగ్గురు వ్యక్తులను లాడ్జిలో నిర్బంధించి దాడి
- 15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముగ్గురు వ్యక్తులను లాడ్జిలో బంధించి దాడి చేసిన ఘటన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... కడప పట్టణానికి చెందిన గంజికుంట రాజేంద్ర కడపలోని నాగరాజు పేటలో సంగీత్ మొబైల్స్ పేరుతో షాపు నిర్వహిస్తున్నాడు. అతనికి రెండు నెలల క్రితం తిరుపతిలోని ఓ రెస్టారెంట్‌లో నరసింహ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. నరసింహ తన వద్ద రామలక్ష్మణ కెమికల్ నాణెం ఉందని, దాని విలువ మార్కెట్‌లో రూ. 2 కోట్లు ధర పలుకుతుందని రాజేంద్రను నమ్మించాడు. నాణెం కోసం రూ. 3 లక్షలు అవసరమని అంత మొత్తం ఇవ్వాలని కోరాడు. ఈ విషయమై నరసింహ, రాజేంద్ర మదనపల్లెలో కలుసుకున్నారు. నాణెం గురించి మాట్లాడుకున్నారు. నాణెం చూపిస్తేనే డబ్బులు ఇస్తానని రాజేంద్ర చెప్పడంతో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. దీంతో రాజేంద్ర అతని ఫోన్ తీసుకుని వెళ్లిపోయాడు. అప్పటి నుంచి నరసింహ తన ఫోన్ తిరిగి ఇవ్వాలని రాజేంద్రను కోరుతున్నాడు. ఈ క్రమంలో అతను రాజేంద్రకు ఓ వీడియో పంపి తన వద్ద నాణెం ఉందని, అది కావాలంటే విజయవాడకు రావాలని ఆశ చూపాడు. దీంతో రాజేంద్ర తన స్నేహితులు ఇద్దరిని తీసుకుని ఈనెల 11న విజయవాడకు చేరుకున్నాడు. నరసింహకు ఫోన్ చేయగా రాయనపాడు చెరువు వద్దకు రావాలని సూచించాడు. అప్పటికే కొంత మందితో అక్కడికి చేరుకున్న నరసింహ తన ఫోన్ ఇవ్వాలని రాజేంద్రను అడిగాడు. అతను తన వద్ద ఫోన్ లేదని చెప్పడంతో నరసింహ, అతనితో వచ్చిన వ్యక్తులు కడప నుంచి వచ్చిన ముగ్గురిపై దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా గవర్నర్‌పేటలోని శాంతి లాడ్జికి కారులో తరలించి నిర్బంధించాడు. లాడ్జిలోనూ మరోసారి దాడి చేశారు. రాజేంద్ర భార్యకు ఫోన్ చేసి నీ భర్త మావద్ద ఉన్నాడని, రూ. 30 లక్షలు ఇస్తే వదిలిపెడతామని బెదిరించారు. ఆ సమయంలో బాత్రూంకు వెళ్లిన రాజేంద్ర తన భావకు మెసేజ్ చేశాడు. అతను 112 కాల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు శాంతి లాడ్జికి చేరుకుని రాజేంద్రతో పాటు అతని స్నేహితులను రక్షించారు. రాజేంద్ర, అతని స్నేహితులను లాడ్జిలో నిర్బంధించి కుటుంబ సభ్యులను బెదిరించిన నరసింహతోపాటు మరో 14 మందిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో భవానిపురానికి చెందిన ప్రవీణ్, దినేష్, బూరి రాజేష్, రాయనపాడుకు చెందిన ధీరజ్, స్వాగత్, సోహైల్ హర్షద్, గోవాడ సీతారాం, పాండు, నాని, సందీప్, సాంబ, సాయి, సత్యలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామలక్ష్మణ కెమికల్ కాయిన్స్, రైస్ పుల్లింగ్, రెండు తలల పాములు వంటి వాటికి మహిమలు ఉన్నాయని, కోట్లు విలువ చేస్తాయని అనే మాటలు నమ్మి మోసపోవద్దని గవర్నర్‌పేట సీఐ ఎం. సత్యనారాయణ ప్రజలకు సూచించారు.

బార్‌ల వద్ద భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల కాలంలో నగరంలో మద్యం విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. బార్ల వద్ద ట్రాఫిక్, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా మరింత పటిష్టంగా చర్యలు చేపట్టేందుకు వాటి యజమానులు ప్రత్యేక దృష్టి సారించాలని సింగ్‌నగర్ సీఐ కోమాకుల శివాజీ సూచించారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బార్ల యజమానులకు సోమవారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రధానంగా రాత్రి వేళల్లో అనేక శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని వీటిని పరిష్కరించేందుకు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మద్యం విక్రయాలపై నియంత్రణ విధానం, బార్‌లో ఉన్న ఖాతాదారుల భద్రత గురించి అవగాహన కల్పించారు. రాత్రి వేళల్లో క్లోజింగ్ సమయాలను కచ్చితంగా పాటించాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని యజమానులకు సూచించారు.

అలరించిన సంగీత విభావరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన సూర్యప్రభ సంగీత అకాడమికి చెందిన కళ్యాణి శిష్యబృందం ఆలపించిన సంగీత విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై సోమవారం సాయంత్రం సంగీత విభావరి జరిగింది. పలు కీర్తనలను లయబద్ధంగా ఆలపించగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కళ్యాణి శిష్య బృందానికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలు అందించారు.

అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తా

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ మోటార్ పెయింటర్స్ అసోసియేషన్‌కు అన్ని విధాలుగా కృషి చేస్తానని అసోసియేషన్ నూతన అధ్యక్షుడు వేల్పుకొండ వీరాచారి అన్నారు. అసోసియేషన్ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. సమీప అభ్యర్థి ఎం.విజయకుమార్‌పై (గన్‌గుర్తు), బ్రష్ గుర్తు అభ్యర్థి వేల్పులకొండ వీరాచారి 103 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంధం వెంకటేశ్వరరావు (కొండా), షేక్ దస్తగిరి, కోశాధికారి ఐ. ఉమామహేశ్వరరావు వీరాచారిని పూలమాలతో సత్కరించారు. వీరాచారి మాట్లాడుతూ అసోసియేషన్ తరుపున ప్రతి సభ్యుడికీ రూ.లక్ష ఇన్సూరెన్స్ సౌకర్యం కలిప్తున్నట్టు చెప్పారు. నిరంతరం సభ్యుల అభ్యున్నతికి పనిచేస్తామన్నారు. అనంతరం కార్మికవాడలో ర్యాలీ నిర్వహించారు.

నిరుపేదలకు సాయం చేయడంలోనే అసలైన సంతృప్తి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేదలకు సహాయం చేయడంలోనే అసలైన సంతృప్తి ఉందని కళ్లే లలితా ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కళ్లే నాగేశ్వరరావు అన్నారు. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు ఉన్న దాంట్లో లేని వారికి సాయం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ట్రస్ట్ సేవలను మరింతగా విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి. ధ్రువన్ పాల్గొన్నారు.

నేతన్నల సంక్షేమమే ధ్యేయం

మంత్రి సవిత



చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మంత్రి సవిత

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడ నగరంలోని మేరీస్ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సోమవారం ఆమె పరిశీలించి స్టాల్స్‌లోని నేతన్నలను పలకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన గాంధీ బునకర్ మేళా పేరుతో చేనేత వస్త్ర ప్రదర్శనను సీఎం చంద్రబాబు ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఈ వస్త్ర ప్రదర్శన ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించాలని తొలుత నిర్ణయించామని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఎగ్జిబిషన్‌ను మరో వారం పొడిగించనున్నట్లు స్పష్టం చేశారు. దళారుల ప్రమేయం లేకుండా, నేతన్నలకు మేలు కలగజేయాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు మరింత పెరిగేలా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత వస్త్ర ప్రదర్శనలు (ఎగ్జిబిషన్‌లు) నిర్వహించనున్నట్లు తెలిపారు. నేతన్నలకు శిక్షణ ఇచ్చి ఈ కామర్స్‌లో చేనేత వస్త్రాలు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నేతన్నలకు 365 రోజులు పని కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ఆమె రెండు ఆప్కో చీరలు, చీరాల డ్రెస్ మెటీరియల్ కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పవన్ మూర్తి, జేడీ కన్నబాబు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసన

- కరోనాలో విధులు నిర్వర్తించిన కార్మికులను వారియర్స్‌గా గుర్తించాలి
- 18 నెలలు నిలిపివేసిన డీఏను విడుదల చేయాలి
- మజ్దూర్ యూనియన్ డీఎస్ లాలా డిమాండ్



సమస్యలపై డీఆర్ఎంకు వినతి పత్రం సమర్పించిన డీఎస్ లీలా తదితరులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని, కరోనా సమయంలో ఫ్రీజ్ చేసిన 18 నెలల డీఏను తిరిగి చెల్లించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజన్ కార్యదర్శి ఎల్.లీలా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడ డివిజన్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గూడూరు నుంచి అకనాపల్లి వరకు అన్ని రైల్వే కార్యాలయాల ఎదుట ఆందోళ చేపట్టారు. డీఆర్ఎం కార్యాలయం ఎదుట సోమవారం గేట్ మీటింగ్ ఏర్పాటు చేసి డీఆర్ఎంకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీఎస్ లీలా మాట్లాడుతూ ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశామని చెప్పారు. కరోనా సమయంలో వ్యవస్థలు అన్ని స్తంభించి పోయినప్పుడు కేవలం రైల్వే కార్మికులు మాత్రమే పని చేసి శ్రామిక స్పెషల్స్, కిసాన్ స్పెషల్స్ నడిపి దేశ వ్యాప్తంగా నిత్యావసర వస్తువులను రవాణా చేశారని తెలిపారు. ప్రాణాలకు తెగించి పని చేసిన రైల్వే కార్మికులను కరోనా వారియర్స్‌గా గుర్తించకపోవడం అన్యాయమన్నారు. ఆ సమయంలో దేశ ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉందని చెప్పి 18 నెలల పాటు రైల్వే కార్మికులతో పాటుగా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల పెన్షన్‌లో కూడా కోత కోసిన ఘనత ఈ ప్రభుత్వానికే చెల్లుతుందని విమర్శించారు. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద వ్యవస్థగా ఉన్నప్పుడు ప్రాణాలకు తెగించి పని చేసిన రైల్వే కార్మికులకు, పెన్షనర్లకు ఫ్రీజ్ చేసిన డీఏ తిరిగి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆలిండియా రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిక్సిడ్ మెడికల్ అలవెన్సును వెయ్యి రూపాయల నుంచి 3 వేల రూపాయలకు పెంచాలని పార్లమెంట్ సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదికను కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేయడం అన్యాయమని విమర్శించారు. అలాగే ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటుకు చర్యలు చేపట్టి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్స్‌నకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మజ్దూర్ యూనియన్ డివిజనల్ ప్రెసిడెంట్ రామగుప్త, సహాయ డివిజనల్ కార్యదర్శులు శేఖర్ బాబు, పాములు , సభ్యులు వెంకటేశ్వర రావు, అహ్మద్ షరీఫ్, భాను బాబు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బాబాయ్ హోటల్లో సందడి



తంగలాన్ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా సోమవారం విజయవాడ నగరానికి విచ్చేసిన హీరో చియాన్ విక్రమ్, హీరోయిన్ మాళవిక మోహనన్, ఇతర యూనిట్ సభ్యులు బాబాయ్ హోటల్‌లో సందడి చేశారు. హీరో, హీరోయిన్‌లు హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా అభిమానులు చుట్టుముట్టి సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

15న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన ఎంబీ విజ్ఞాన కేంద్రంలో చిన్నారులకు జయహో భారత్...ప్రౌడ్ టు బీ యాన్ ఇండియన్ ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ అధ్యక్షుడు ఎ.సునీల్‌కుమార్ తెలిపారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కాంటెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసి వారికి సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేయాలనే ముఖ్య ఉద్దేశంతో రీ క్రియేట్ త్రీడీ లైఫ్ కాస్టింగ్ సమర్పణలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. 1వ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులను నాలుగు గ్రూపులుగా విభజించి వేర్వేరు అంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సబ్‌జూనియర్స్ (1,2,3 తరగతులు), జూనియర్స్(4,5,6 తరగతులు), సీనియర్స్ (7,8,9,10 తరగతులు), సూపర్ సీనియర్స్(ఇంటర్, డిగ్రీ, పీజీ)కు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం ఉంటుందని వెల్లడించారు. ప్రవేశం ఉచితం, ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను వాట్సాప్ నంబర్ 93479 50085 లేదా ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ వీజేఏ జీమెయిల్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ రావు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఉపాధ్యక్షుడు గిరిధర్ అరసవల్లి, ప్రధాన కార్యదర్శి స్ఫూర్తి శ్రీనివాస్, ఉమెన్ వింగ్ ఇన్‌చార్జి సంధ్యారాణి, వర్కింగ్ కమిటీ సభ్యులు లలితా, సౌజన్య, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.